ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 ఏప్రిల్ 2025



శ్రీకూర్మం ఈవోగా నరసింహనాయుడు



గార ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీకూర్మనాథుని ఆలయం నూతన కార్యనిర్వహణాధికారి (ఈవో)గా కె.నరసింహనాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలో రాష్ట్ర పురావస్తు శాఖలో ఏడీగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. తొలుత స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన గురునాథరావు పలాసకు బదిలీపై వెళ్లారు.



ఇక సర్దుబాటు!

- సచివాలయాల్లో మిగులు సిబ్బంది 1,534 మంది
- హేతుబద్ధీకరణలో తేలిన లెక్క
- జనాభా ప్రాతిపదికన సేవలు
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం ఎదురుచూపు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల సమూల ప్రక్షాళనకు చర్యలు చేపడుతోంది. సచివాలయ ఉద్యోగులను పూర్తిగా ప్రజోపయోగ పనులకు వినియోగించాలని భావిస్తోంది. అందుకే ఉద్యోగుల హేతుబద్ధీకరణ చేపట్టింది. గ్రామ/వార్డు సచివాలయాలను ఏ,బీ,సీ విభాగాలుగా విభజించి.. జనాభా ప్రాతిపదికన ఉద్యోగులను నియమించనుంది. హేతుబద్ధీకరణ తరువాత జిల్లాలో మిగులు ఉద్యోగులుగా 1,534 మందిని గుర్తించింది. వీరిని వివిధ శాఖలకు కేటాయించనుంది.

- 2019 అక్టోబరు 2న వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 732 గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రజలకు స్థానికంగా సేవలందించే పేరిట ప్రతి సచివాలయంలో 11 శాఖలకు సంబంధించి సహాయకులను నియమించింది. జిల్లా బోర్డు ఆధ్వర్యంలో మొత్తంగా 6,476 మంది ఉద్యోగుల నియామకాలు చేపట్టింది. కాగా కొన్నిచోట్ల సిబ్బంది ఎక్కువగా, మరికొన్ని చోట్ల తక్కువగా ఉన్నారు. దీంతో కొందరికి పని తక్కువగా ఉండగా.. మరికొందరిపై విపరీతంగా భారం పడుతోంది. ధ్రువపత్రాల జారీలో డిజిటల్, వెల్ఫేర్ కార్యదర్శులు కీలకంగా వ్యవహరిస్తారు. వీరి సంఖ్య తక్కువగా ఉంది. పలుచోట్ల సాంకేతిక సహాయకులు లేకపోవడంతో ఆ పనిని వెల్ఫేర్ అసిస్టెంట్లు చేస్తున్నారు. కొన్ని చోట్ల చాలా శాఖలకు సంబంధించి కార్యదర్శులకు పనిలేకుండా పోతోంది. ఉదాహరణకు మత్స్యకారులు లేని సచివాలయాల్లో మత్స్యశాఖకు సంబంధించి కార్యదర్శులను నియమించారు. వారికి ఎటువంటి పని లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను హేతుబద్ధీకరణ చేసింది. ఉద్యోగుల్లో చాలామంది ఇంజనీరింగ్, డిప్లమో, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో మెరుగ్గా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల సచివాలయ ఉద్యోగుల సీఎంఎఫ్ఎస్ ఐడీ, సెల్‌ఫోన్ నంబరు, విద్యార్హత, కులం, ఉపకులం వివరాలు సేకరించింది. బీటెక్, ఎంటెక్, ఈసీఈ, మెకానికల్, సివిల్, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారి సమాచారం తీసుకుంది. ఇప్పుడు ఉద్యోగుల రేషన్‌లైజేషన్‌లో ప్రజా అవసరాల మేరకు వీరి సేవలను వినియోగించనుంది.

ఏబీసీలుగా విభజన

సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు సంబంధించి ఏ,బీ,సీ విభాగాలుగా రూపొందించారు. మల్టీపర్పస్, టెక్నికల్, ఆస్పిరేషనల్ ఫంక్షనరీలుగా విభజించారు. వాటి ఆధారంగా ఉద్యోగులను సర్దుబాటు చేస్తారు. ఆస్పిరేషనల్ ఫంక్షనరీలు క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. ఏ- కేటగిరికి సంబంధించి 2,500 మంది జనాభాలోపు ఉన్న సచివాలయాల్లో ఇద్దరు మల్టీపర్పస్ ఫంక్షనరీలు, నలుగురు టెక్నికల్ ఆస్పరేషనల్ ఫంక్షనరీలు ఉంటారు. బీ- సెక్షన్‌కు సంబంధించి 2,500 నుంచి 3000 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు ఉంటారు. సి- సెక్షన్‌కు సంబంధించి 3వేలకుపైగా జనాభా ఉన్న సచివాలయాల్లో నలుగురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ ఫంక్షనరీలు ఉంటారు. అలాగే ప్రభుత్వం ఇటీవల డ్రోన్లతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జియో ట్యాగింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. వాటి బాధ్యతలను సైతం అప్పగించే చాన్స్ ఉంది. హేతుబద్ధీకరణ నేపథ్యంలో సుమారు 4,942 మంది ఉద్యోగులను సచివాలయాలకే కేటాయించే అవకాశం ఉంది. మిగిలిన 1534 మందిని ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ శాఖలకు కేటాయిస్తారు.

- గ్రామ సచివాలయాల్లో మల్టీపర్పస్ ఫంక్షనరీల్లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్ తోపాటు మహిళా పోలీసులు ఉంటారు. వార్డు సచివాలయానికి సంబంధించి అడ్మిన్ కార్యదర్శి, ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉంటారు.
- గ్రామ సచివాలయాల్లో టెక్నికల్ ఫంక్షనరీలకు సంబంధించి వీఆర్వో, ఏఎన్ఎం, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయం, పశుసంవర్థక ఎనర్జీ కార్యదర్శి ఉంటారు. వార్డు సచివాలయాల్లో రెవెన్యూ కార్యదర్శి, ఆరోగ్య కార్యదర్శి, ప్లానింగ్ కార్యదర్శి, ఎమినిటీస్, శానిటరీ, ఎనర్జీ కార్యదర్శులు ఉంటారు.



కొళిగాం సచివాలయం

పని సర్దుబాటు కోసమే

సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ వాస్తవమే. ప్రభుత్వం మూడు విభాగాలు విభజించింది. ఆ మేరకు ఉద్యోగులను సర్దుబాటు చేస్తుంది. సేవలు సరళతరం, ఉద్యోగులపై భారం తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది.

– ఉదయ్‌కుమార్, సచివాలయాల శాఖ జిల్లా అధికారి, శ్రీకాకుళం

జీడి ఆధారిత పరిశ్రమలేవీ?

- ఆసక్తి చూపని వ్యాపారులు
- పెట్టుబడి పెట్టేందుకు వెనుకంజ


ఉద్దానంలో పండే జీడిపళ్లు..

పలాస, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో జీడిపంట విస్తారంగా సాగు అవుతున్నా.. జీడిపండ్ల ఆధారిత పరిశ్రమల స్థాపన మాత్రం కలగానే మిగులుతోంది. ఫలితంగా ఎన్నో ప్రయోజనాలు కలిగిన జీడిపండు.. వృథా అవుతోంది. సాధారణంగా ఏ పండుకూ లేని ఘనత జీడికి ఉంది. ఎక్కడైనా పండును తిని గింజను పారబోస్తాం. కానీ జీడిలో మాత్రం గింజను భద్రం చేసి పండును పనికిరాదని పారబోస్తుంటాం. జీడి పండును సక్రమంగా వినియోగిస్తే గింజకన్నా అధికంగా లాభాలు ఆర్జించవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపితమైంది. అయితే అందుకు తగిన సాధనాలు, మార్కెటింగ్ లేకపోవడం, తినడానికి వగరుగా ఉండడంతో జీడిపండు కేవలం మట్టిలో కలిసి ఎరువుగా మారింది. ఈ పళ్లు ఎందుకూ పనికిరాకుండా తోటల్లో వృథాగా పడిపోతున్నాయి.

- జీడిపండు రంగు ముచ్చటగా ఉన్నా, సువాసన మాత్రం ఘాటుగా ఉంటుంది. ఇందులో నిమ్మజాతుల కంటే అధికంగా సి విటమిన్ లభిస్తుంది. జీడి పళ్లను పిక్కనుంచి వేరు చేసిన తరువాత నీటిలో బాగా కడిగి ప్రాసెసింగ్‌కు వినియోగించాలి. స్టీల్, ప్లాస్టిక్ పాత్రల్లో మాత్రమే దీన్ని నిల్వ చేయాలి. ఈ పళ్లను సేకరించిన తరువాత 15-17 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉంచితే 15 రోజుల వరకూ పాడవకుండా ఉంటుంది. దీని గుజ్జును అతి శీతల దశలో నిల్వ చేస్తే ఏడాది పొడవునా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది.
- జీడిపండ్ల నుంచి గుజ్జు తీసి.. దాని ద్వారా రసం తీయా లి. పండు బట్టి 50శాతం వరకూ రసం ఇందులో వస్తుంది. ఇందులో ఘాటయిన పదార్థాన్ని వెలికితీయడానికి కిలోకు రెండు గ్రాముల సగ్గుబియ్యం పొడిని సరిపడా చల్లనీటిలో కరిగించి తరు వాత వాటిని వేడిచేసి అందులో కలియబెట్టాలి. 3 గంటల తరువాత పైకి తేలిన రసాన్ని తీసుకొని జ్యూస్, స్క్వాష్, సిరప్‌ల తయారీకి వినియోగించవచ్చు.

ముందుకు రాని వ్యాపారులు

జీడిపండు ఆధారిత పరిశ్రమలు స్థాపించేందుకు అనువైన పరిస్థితి ఉన్నా వ్యాపారులు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో 32 వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. మొత్తం పండ్లను సేకరిస్తే 5 పరిశ్రమల వరకూ ముడిసరుకు సరిపోతుంది. దీనిపై అవగాహన లేకపోవడంతో వ్యాపారులు ముందుకు రాలేకపోతున్నారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రెండేళ్ల కిందట అవగాహన కార్యక్రమం, ఆధారిత పరిశ్రమలను పరిచయం చేసినా సరైన గైడెన్స్ లేకపోవడంతో పరిశ్రమల ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు. జీడి జ్యూస్‌తో పాటు సోడాలు చేయవచ్చని అధికారులు అవగాహన కల్పించారు. కొత్తగా ఏర్పాటవుతున్న పారిశ్రామికవాడలో జీడి పండ్ల ఆధారిత పరిశ్రమలు స్థాపించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తే వ్యాపారులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ జరిగితే జీడి పిక్కలతో పాటు పండ్లకు మంచి వ్యాపారం ఉంటుందనడంలో సందేహమే లేదు.

అవగాహన కల్పించాలి



జీడి పళ్ల ఆధారిత పరిశ్రమలపై వ్యాపారులకు అవగాహన కల్పించాలి. పండు వల్ల ప్రయోజనాలు ఉన్నాయి. ప్రజలకు కూడా అవగాహన కల్పించాలి. పరిశ్రమలు పెట్టిన తరువాత మార్కెటింగ్ లేకపోతే ఇబ్బందులు పడేది వ్యాపారులే. ఔత్సాహిక వ్యాపారులకు కూడా ప్రోత్సహిస్తాం.

-రవిశంకర్‌గుప్తా, జీడి వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి, పలాస


సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రూ.258 కోట్లతో మత్స్యకార భరోసా

- మంత్రి అచ్చెన్నాయుడు
- సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 'చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆసరాగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద రూ.258 కోట్లు అందజేయనుంది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ఈ నెల 26న సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకార భరోసా నిధులు పంపిణీ చేయనున్నార'ని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం బుడగట్లపాలెంలో సీఎం పర్యటన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం మత్స్యకారులకు కనీసం బోట్లు, వలలు కూడా పంపిణీ చేయలేదు. గతంలో అనర్హులకు, వైసీపీ సానుభూతిపరులకు మాత్రమే రూ.10వేలు చొప్పున అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గతంలో ఇచ్చిన మత్స్యకార భరోసా మొత్తాన్ని రెట్టింపు చేశాం. మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామ'ని తెలిపారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి అధికారులతో సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్యమంత్రి మత్స్యకారులు, పార్టీ శ్రేణులతో వేర్వేరుగా సమావేశం (మిగతా 6వ పేజీలో..)




శ్రీకాకుళంలో జాతీయజెండా, ప్లకార్డులతో ముస్లింల ర్యాలీ

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

- ముస్లిం జేఏసీ, పౌర సంఘాల నేతల డిమాండ్

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం జేఏసీ నేతలు, వివిధ పౌరసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా గురువారం శ్రీకాకుళంలో డైమండ్ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. 'కేంద్రం ఈ సవరణలతో ముస్లింల అణచివేతకు కారణమవుతోంది. ఈ చట్టం (మిగతా 6వ పేజీలో..)

ఈ నెల బియ్యం లేవు.. డబ్బులు తీసుకోండి!

- పదనాపురం డిపోలో లబ్ధిదారులకు నగదు పంపిణీ


పదనాపురంలో రేషన్ గోదాము

మెళియాపుట్టి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడుతున్నా.. కొన్నిచోట్ల రేషన్ సరుకులు పక్కదోవపడుతున్నాయి. మెళియాపుట్టి మండలం పదనాపురంలో రేషన్ డీలర్ ఈ నెల బియ్యానికి బదులు లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ డిపో పరిధిలో ప్రతినెలా 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు పంపిణీ చేస్తారు. ఈ నెల మాత్రం 9 క్వింటాళ్ల బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన 9 క్వింటాళ్లకు సంబంధించి బియ్యం పంపిణీ చేయకుండా, కిలో రూ.20 చొప్పున లబ్ధిదారులకు డీలర్ చెల్లించారు. బియ్యం అందజేసినట్టు బయోమెట్రిక్ వేయించుకున్నారని గ్రామానికి చెందిన మంగమ్మ, గణపతి తదితర రేషన్‌కార్డుదారులు తెలిపారు. దీనిపై డీలర్‌ను ప్రశ్నించగా ఈ నెలకు బియ్యం లేవని, డబ్బులు తీసుకోవాలంటూ నచ్చజెప్పారన్నారు. ఈ నెల రేషన్ బియ్యం తరుగు వచ్చిందని, అలాగే ఇటీవల వర్షాలకు 18 బియ్యం బస్తాలు తడిచిపోయాయని చెప్పారని తెలిపారు. కాగా ప్రస్తుతం రేషన్ బియ్యానికి డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఒక్కో కార్డుదారుడికి ప్రతినెలా ఐదు కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఈ బియ్యం మార్కెట్‌లో కిలో రూ.25 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో (మిగతా 6వ పేజీలో..)

కొత్తబాటలు వేసుకుందాం

- వేసవి సెలవుల సద్వినియోగంపై దృష్టి పెట్టాలి
- అభిరుచులకు కార్యరూపమివ్వాలి
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం వద్దు
- టీవీలకు అతుక్కుపోతే సమస్యే

6లో

రోడ్డుపై మురుగు.. రాకపోకలకు అవస్థలు

- పాలకమండలి లేక పరిష్కారానికి నోచుకోని వైనం
- ఇదీ ఆమదాలవలస మునిసిపాలిటీలో పరిస్థితి

8లో

ముగిసిన పంచకుండాత్మక యజ్ఞం

- వేడుకగా జల విసర్జన శోభాయాత్ర

6లో


శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

ఇంకా 'జగన్' నామస్మరణమే!

- సచివాలయం బోర్డులపై మాజీ సీఎం ఫొటోలు

6లో

ఇది ఆటల కాలమనీ..

- 1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు
- శాప్ ఆధ్వర్యంలో ఏర్పాటుకు సన్నాహాలు





వాలీబాల్‌లో శిక్షణ పొందుతూ..



హ్యాండ్‌బాల్‌లో...

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

ఎప్పుడెప్పుడు వేసవి సెలవులు వస్తాయా? ఎప్పుడెప్పుడు క్రీడా మైదానాల్లోకి చేరిపోదామా అని విద్యార్థులు ఏడాదంతా ఎదురు చూస్తూ ఉంటారు. తిండీ నిద్రలను సైతం మరచిపోయి మరీ ఆటలతో గడిపే వారు ఎందరో. అదే సమయంలో పిల్లలు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వమూ సహకారం అందిస్తోంది. వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తోంది. ఏటా మే ఒకటి నుంచి 31వ తేదీ వరకు అంటే నెలరోజుల పాటు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తోంది. దాదాపు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో క్రీడా శిబిరాలు నిర్వహిస్తుంది. ఈ శిబిరాల్లో విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో శిక్షణ పొందే అవకాశం ఉంటుంది. మరోవైపు ఇప్పటికే జిల్లా కేంద్రం శ్రీకాకుళంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని క్రీడా మైదానాలు క్రీడాకారులతో నిండిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటలతో ఉత్సాహంగా గడిపేస్తున్నారు.



చిన్నారులకు శిక్షణ ఇలా...



బాక్సింగ్‌లో...

ఇంకా 'జగన్' నామస్మరణమే!

- సచివాలయం బోర్డులపై మాజీ సీఎం ఫొటోలు



సచివాలయం బోర్డుపై ఉన్న జగన్ ఫొటో



సచివాలయం ముందర ఉన్న మరో బోర్డులో..

శ్రీకాకుళం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం దిగిపోయి... ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పది నెలలు కావస్తోంది. అన్ని చోట్లా కొత్త ప్రభుత్వ నిబంధనలు అమలవుతున్నా.. శ్రీకాకుళం నగరంలోని ఓ వార్డు సచివాలయంలో ఇంకా మాజీ ముఖ్యమంత్రి 'జగన్' నామస్మరణే సాగుతోంది. వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసినప్పుడు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో కూడిన 'వార్డు సచివాలయం' బోర్డులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఫొటోలను తాత్కాలికంగా మూసేశారు. ప్రభుత్వం మారిన తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ శ్రీకాకుళం నగరంలోని సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న వార్డు సచివాలయం వద్ద మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటంతో ఉన్న బోర్డులు అలానే ఉన్నాయి. ఇదే రోడ్డుకు అత్యంత సమీపంలో కలెక్టర్ బంగ్లా ఉంది. జిల్లా ఉన్నతాధికారులు సైతం ఈ రోడ్డు మీదుగానే కలెక్టరేట్‌కు వెళ్తుంటారు. ప్రభుత్వం మారి పది నెలలు గడుస్తున్నా.. సచివాలయ సిబ్బంది 'వార్డు సచివాలయం' బోర్డుపై మాజీ సీఎం ఫొటో తొలగించకపోవడం... వారికి గల స్వామి భక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. కొంతమంది తెలుగుదేశం నాయకులు బోర్డు మార్పు చేయాలని చెప్పినా.. ఇంతవరకు చర్యలు తీసుకోలేదని.. జగన్ ఫొటోను సచివాలయం బోర్డులపై కొనసాగిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.



ఊరేగింపులో పాల్గొన్న యువత

ముగిసిన పంచకుండాత్మక యజ్ఞం

- వేడుకగా జల విసర్జన శోభాయాత్ర



విగ్రహాల ఊరేగింపు..

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బెల్లుపడ గ్రామంలో త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సాగుతున్న పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీరామ తారక మహామంత్ర యజ్ఞం ఘనంగా ముగిసింది. గురువారం ఉదయం మహా పూర్ణాహుతి, వేదాశీర్వచనం, శ్రీస్వామివారి అనుగ్రహ భాషణం జరిగింది. సాయంత్రం సుమారు 1500 మంది మహిళలు కలశాలతో జల విసర్జన యాత్రలో పాల్గొన్నారు. బెల్లుపడ గ్రామం నుంచి ఉప్పాడ వీధి, కార్జి వీధి, రథం వీధి మీదుగా మార్కెట్ జంక్షన్, దాసన్నపేట నుంచి పాత బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా వెళ్లి... బాహుదా నదిలో కలశాలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, వివిధ ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

రూ.258 కోట్లతో మత్స్యకార భరోసా

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. హెలిప్యాడ్, రూట్ మ్యాప్, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై తగు సూచనలు చేశారు. సీఎం పర్యటనలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి ముందస్తు భద్రత కల్పించాలన్నారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్ల ఏర్పాటు, సభా వేదిక భద్రత, మత్స్యకారులతో ముఖాముఖి, అమ్మవారి గుడి సందర్శన తదితర చోట్ల పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఇంటెలిజెన్స్ సెక్యూ రిటీ వింగ్ ఏఎస్పీ ఏవీ రమణ, ఏఎస్పీ వి.శ్రీనివాసరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, డీఎస్పీలు, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, కూటమి నేతలు పైడి ముఖలింగం, గాలి వెంకటరెడ్డి, స్థానిక సర్పంచ్ అలుపల్లి రాంబాబు పాల్గొన్నారు.

ఈ నెల బియ్యం లేవు.. డబ్బులు తీసుకోండి!

(ఐదో పేజీ తరువాయి)

కొన్ని డిపోల్లో రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టించి.. మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పేదలకు సక్రమంగా బియ్యం అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తహసీల్దార్ బి.పాపారావు వద్ద ప్రస్తావించగా.. రేషన్ బియ్యానికి బదులు డబ్బులు ఇచ్చినట్టు తన దృష్టికి రాలేదన్నారు. ఈ విషయంపై సీఎస్‌డీటీ ద్వారా వివరాలు సేకరించి.. నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వితంతువులకు పింఛన్ల వర్తింపు

అరసవల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పింఛను అందుకుంటూ మరణించిన పురుషుల జీవిత భాగస్వాములకు ఆ మొత్తాన్ని వర్తింప జేసేందుకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన కృషి ఫలించింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో 89,778 మంది వితంతువులు పింఛన్లకు దూరమయ్యారు. వారి కష్టాలను చూసి చలించిన మంత్రి అచ్చెన్నాయుడు సమస్యపై క్యాబినెట్ సమావేశంలో చర్చించారు. వితంతువులకు తమ జీవిత భాగస్వామికి సంబంధించిన పింఛనును వర్తింపజేయాలని నిర్ణయించారు. ఈమేరకు జీవోను విడుదల చేశారు. వీరికి నెలకు రూ.4 వేల చొప్పున అందించేందుకు ప్రభుత్వం రూ.35.91 కోట్లు విడుదల చేసింది.


వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

ద్వారా ముస్లిమేతరులకు వక్ఫ్‌బోర్డులో ప్రవేశం కల్పించడం అన్యాయం. ఈ చట్టాన్ని ఒప్పుకునే ప్రసక్తే లేదు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తే సహించేది లేదు' అని వారు హెచ్చరించారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీస్తే దేశవ్యాప్తంగా ఉద్యమించేందుకు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడతామని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అలాగే కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ.. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇది క్రూరమైన చర్య అని, ఈ సంఘటనకు కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకపై ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు బవిరి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి గోవిందరావు, నాయకులు తాండ్ర ప్రకాష్, కొంక్యాన వేణుగోపాల్, డి.గణేష్, రాంగోపాల్, మిస్కా కృష్ణయ్య, గంజి ఎజ్రా, జేఏసీ కన్వీనర్ షేక్ సలీం, అమీర్, ముజీబ్, రఫీ, మహిబుల్లాఖాన్, షాన్, జిలానీ సుక్రుఖాన్, వివిధ మసీదుల మత పెద్దలు పాల్గొన్నారు.

కొత్తబాటలు వేసుకుందాం





- వేసవి సెలవుల సద్వినియోగంపై దృష్టి పెట్టాలి
- అభిరుచులకు కార్యరూపమివ్వాలి
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం వద్దు
- టీవీలకు అతుక్కుపోతే సమస్యే

ఎచ్చెర్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):

వేసవి సెలవులు వచ్చేశాయి. జూన్ 11వ తేదీ వరకు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. వేసవి విరామంలో వారికి నచ్చిన వ్యాపకాల్లో గడుపుతూనే పిల్లలు ఆసక్తికరమైన అంశాలపై దృష్టి సారించి.. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివిధ రంగాల నిపుణులు సూచిస్తున్నారు. అభిరుచులకు పదును పెట్టేందుకు వినియోగించుకోవాలని చెబుతున్నారు. తద్వారా అటు సెలవుల్లో హాయిగా గడుపుతూనే... కొత్త అంశాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందని అంటున్నారు. టీవీలు, సెల్‌ఫోన్లను పరిమితికి మించి చూడొద్దని సూచిస్తున్నారు. దీని వల్ల అనేక శారీరక, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

అబాకస్ నేర్చుకుంటూ..

విద్యార్థులు కష్టంగా భావించే గణితాన్ని ఇష్టంగా నేర్చుకొనేందుకు ఇదే సరైన సమయం. చైనీస్ టెక్నిక్ అయిన అబాకస్‌ను ప్రత్యేక శిక్షణ ద్వారా నేర్చుకోవచ్చు. లాజికల్ రీజనింగ్, ఐఐటీ గణితం, షార్ట్‌కట్, టెక్నిక్స్ వంటివి ప్రత్యేక అధ్యయనం ద్వారా సాధిస్తున్నారు. ఏకాగ్రత, వేగంగా కచ్చితమైన లెక్కలను, న్యూమరికల్ ఎబిలిటీ వంటివి అబాకస్ ద్వారా నేర్చుకోవచ్చు.

ఆంగ్లంలో ప్రావీణ్యానికి..

ప్రస్తుతం ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పనిసరి. విద్యార్థి దశలోనే ఇంగ్లీషుపై పట్టుసాధిస్తే అన్ని విధాలా ప్రయోజనం ఉంటుంది. స్పీకింగ్ స్కిల్స్, గ్రామర్, వివిధ భాషల అనువాదంపై శిక్షణ పొందడం ద్వారా ఉపయోగం ఉంటుంది.

గ్రంథాలయాలకు వెళ్తూ..

పుస్తక పఠనం వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. విద్యార్థుల్లో చదివే సామర్థ్యాన్ని పెంచాలి. విజ్ఞాన, వినోద, క్రీడలకు సంబంధించిన విషయాలు తెలుసుకొనేలా గ్రంథాలయాలు ఉపయోగపడతాయి. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తి పొందే అవకాశం ఉంది. గ్రంథాలయాల్లో వేసవి సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

సామాజిక అంశాలపై ...


విద్యార్థి దశలోనే సామాజిక సేవలపై దృష్టి సారించాలి. స్నేహితులతో కలిసి సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యం కావాలి. వేసవి సెలవుల్లో చలివేంద్రాల వద్ద తాగునీరు అందిస్తూ, స్వచ్ఛ భారత్ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటే మంచిది.

ఉన్నత చదువులపై దృష్టి..

వేసవి సెలవుల్లో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యేలా సాధన చేయడం మంచిది. విద్యార్థి స్థాయి మేరకు ప్రిపేర్ కావాలి. దీనికి కోచింగ్ సెంటర్లలో కూడా శిక్షణ ఇస్తున్నారు. ఇందుకను గుణంగా శిక్షణ పొందడం వల్ల సత్ఫలితాలు సాధించవచ్చు.

కళల సాధనలో..

విద్యార్థులకు ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. నృత్యం, సంగీతం, జానపదులు, కరాటే తదితర వాటిపై ఆసక్తి చూపుతారు. వారి ఆసక్తి మేరకు వేసవి శిబిరాల్లో సాధన చేయిస్తే ప్రయోజనం ఉంటుంది.



మంచి దస్తూరి కోసం..

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే మంచి దస్తూరి కీలకం. ప్రత్యేక కాలిగ్రఫీ, ఇటాలిక్, ఇంగ్లీష్ దస్తూరి కోసం ప్రత్యేక శిక్షణ అవసరం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో దస్తూరి కోసం సాధన చేస్తే మంచిది. మంచి మార్కుల కోసం చేతి రాతను అభివృద్ధి చేసుకోవడం అవసరం.

చిత్రలేఖనంలో..

కొంతమంది చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై దృష్టి సారిస్తున్నారు. దానికి మరింత పదును పెడితే అద్భుతంగా రాణించవచ్చు. సృజనాత్మకతను చాటుతూ చిత్రలేఖనం సాధన చేయడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.





కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ..

నేటి పిల్లల్లో కంప్యూటర్ అంటే తెలియనివారు ఉండరు. అప్‌డేట్ అవుతున్న కంప్యూటర్ కోర్సులను యువత తెలుసుకోవడం మంచిది. ముఖ్యంగా మల్టీమీడియా, డేటా, జావా, ఒరాకిల్, వెబ్ డిజైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ తదితర కోర్సులు నేర్చుకోవడం వల్ల ఉజ్వల భవితను పొందవచ్చు.



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీ

మునిసిపల్ కార్పొరేషన్ నూతన కార్యవర్గం

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రెవెన్యూ భవన్ లో గురువారం జరిగిన సమావేశంలో ప్రతీ డిపార్ట్‌మెంట్ నుంచి ఇద్దరు సభ్యులు చొప్పున శ్రీకాకుళం మునిసిపల్ కార్పొరేషన్ నూతన కమిటీ ఏర్పాటు జరిగింది. సభ్యులందరూ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా అల్లి సంజీవరావు, సెక్రటరీగా కైబాడి రామారావు, ట్రెజరర్‌గా బొడిశెట్టి సాయికుమార్, అసోసియేట్ సెక్రటరీగా పంగా వెంకటరమణను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పి.రామినాయుడు, వైస్ ప్రెసిడెంట్స్‌గా వేణుగోపాల్ రెడ్డి, డి.భాగ్యలక్ష్మి, టి.త్రివేణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.చిన్నమ్మడు, జాయింట్ సెక్రటరీలుగా పైడిపెద్ది ధనుంజయ్, కె.హర్షకిరణ్, పి.వెంకటరావు, కె.కిశోర్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీగా ఎ.కిరణ్‌కుమార్, ఈసీ సభ్యులుగా సరిత, పద్మ, సన్యాసిరావు, టి.మౌనిక ఎంపికయ్యారు.

అంగవైకల్యం జయించి..



వీల్‌చైర్‌లో ఫాతిమా ఖత్రీ

పొందూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మస్కిలర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నా ఆమె కృంగిపోలేదు. ఎవరో ఒకరు తోడులేనిదే పాఠశాలకు రాలేని పరిస్థితిని ఆ విద్యార్థిని జయించి.. ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటి ఆదర్శంగా నిలిచింది పొందూరు పట్టణానికి చెందిన ఫాతిమా ఖత్రీ. టెన్త్ ఫలితాల్లో 96 శాతంతో 479/500 (దివ్యాంగులకు ఐదు సబ్జెక్టులు) మార్కులు సాధించింది. ఫాతిమా తల్లిదండ్రులు నజీర్ ఖత్రీ, సమీర ఖత్రీ.

అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లబ్ధిదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది

రణస్థలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీలో అవకతవకలు చోటు చేసుకుంటే ఉపేక్షించేది లేదని రెవెన్యూ సిబ్బంది రమాబాయ్, ఆర్ఐ సతీష్ అన్నారు. '300 రేషన్ కార్డులకు రేషన్ కట్' అనే శీర్షికతో ఈనెల 23న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. దీంతో గురువారం దన్నానపేట గ్రామంలో పలువురు రేషన్ లబ్ధిదారులను కలిశారు. వారి సమస్య అడిగి తెలుసుకున్నారు. పేపర్‌లో వార్త రావడంతో సంబంధిత డీలర్ తమకు బియ్యం ఇచ్చినట్లు తెలియజేశారు. రేషన్ లబ్ధిదారులకు సకాలంలో రేషన్ ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అదేవిధంగా పలు రేషన్ డిపోలు తనిఖీలు చేస్తున్నామన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడి

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో గురువారం నిర్వహించిన వ్యవసాయ శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పంట సరళిలో మార్పులు చేసి, వాతావరణానికి అనుగుణంగా సాగు చేపడితే ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. కీటక శాస్త్రవేత్త ఉదయబాబు, శాస్త్రవేత్త కె.భాగ్యలక్ష్మి అన్నారు. రైతులు, జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: గాంధీ విగ్రహం వద్ద దీక్ష..



గుజరాతీపేట: జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు..



పాతపట్నం: ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో..

ఉగ్రవాదాన్ని తరిమికొడదాం

- వివిధ సంఘాలు, పార్టీల దీక్షలు, నిరసనలు
- జిల్లా వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీలు

ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలని పలు ప్రజా సంఘాల, రాజకీయ పార్టీలు ప్రతినిధులు పిలుపునిచ్చారు. కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాయి. గురువారం జిల్లా వ్యాప్తంగా దీక్షలు చేపట్టారు. నిరసన ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను ఏబీవీపీ కార్యకర్తలు దగ్ధంచేశారు. - ఆంధ్రజ్యోతి బృందం



ఇచ్ఛాపురం: మౌనదీక్షలో జనసేన పార్టీ నాయకులు..



పలాస: నివాళులర్పిస్తున్న భక్తులు



కవిటి: మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ..



సంతబొమ్మాళి: కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ



హిరమండలం: కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

91.3 శాతం ఉత్తీర్ణత

రణస్థలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కొచ్చెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 91.3 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల హెచ్‌ఎం కిల్లి తిరుపతిరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పిలి మోడల్ స్కూల్ కేంద్రంలో కొచ్చెర్ల పాఠశాలకు చెందిన 23 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 21 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇందులో ప్రథమ శ్రేణిలో 12 మంది, ద్వితీయ శ్రేణిలో ఏడుగురు, తృతీయ శ్రేణిలో ఇద్దరు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. కాగా ఇంగ్లిష్ పరీక్ష రోజు డీఈవో ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు జరిగిన విషయం తెలిసిందే.

గ్రంథాలయానికి స్థలం కేటాయింపు



సోంపేట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన్ భవన్ గ్రంథాలయం నిర్మాణానికి మూడు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కృషితో ప్రభుత్వం నుంచి కేయించింది. ఈమేరకు విప్‌కు జై భీమ్‌సేన ప్రతినిధులకు భూ కేటాయింపు పత్రాన్ని గురువారం జైభీమ్‌సేన ప్రతినిధులకు అందజేశారు. ఈకార్యక్రమంలో నగిరి మోహనరావు, బుష్క ఈశ్వరరావు, పూర్ణచంద్ర ఉన్నారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనం

- ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలను ప్రారంభించినకూన రవికుమార్



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గల్లీ నుంచి ఢిల్లీ వరకు అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు తమ కుమారులను ముందుకు తీసుకురావాలన్న ధ్యాసలో అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో చేపట్టిన సీఎం సీసీ ఎమ్మెల్యే కప్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుత్రులను పదవుల్లోకి తీసుకురావాలనే ఆలోచనలో భాగంగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తన కుమరుడ్ని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమించి సుమారు రూ.28 లక్షలు నిధులు స్వాహా చేయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలను ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో ప్రత్యేక నిధుల ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ఆమదాలవలస నియోజకవర్గంలో క్రీడా మైదానాల అభివృద్ధితో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే రవికుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ అధికారులు, సభ్యులు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, పి.ప్రతాప్, నూక రాజు, బోర గోవిందరావు, ఢిల్లీశ్వరరావు, ఎస్.మురళీధర్, తంగి గురయ్య, మురళీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టెన్త్ ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన కె.సాయిస్వరాజ్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

సంస్థాగతంగా పార్టీ బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక 80 అడుగుల రోడ్డులో గల పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ నాయకుల, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పార్టీ సంస్థాగత నియామకాలు చేపడతామని, నిజాయితీగా పార్టీ కోసం కష్టించి పనిచేసిన వారికి గుర్తింపు, గౌరవం కలుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం సాధించేందుకు కృషి చేద్దామన్నారు. అబ్జర్వర్‌గా చింతలపూడి రామకృష్ణ హాజరయ్యారు. నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు అరవల రవీంద్ర, జామి భీమశంకరరావు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

- అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో అని తెలుసుకునేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం ఆసుపత్రి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, అలాగే వైద్యులు ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నించాలని కోరారు. ఏ క్షణంలో ఆపద వచ్చినా ఆదుకునేలా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంచిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం రానున్న విద్యా సంవత్సరంలో ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచితంగా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవోలు శివరాంప్రసాద్, చిట్టిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలో గల ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్ల పేద విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 18004258599లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సోంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): 33-11 కేవీ బుషాభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో, 11కేవీ బాతుపురం ఫీడర్ పరిధిలో (పీఎంఐ) మరమ్మతులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో బాతుపురం, హంసమురా, ఎంజీ పురం, బకుడా, గొడగూరంటి, చిన్నకోష్ట, పద్దెకోష్ట, అంబటికాంబరం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తామన్నారు.

ఆదిత్యుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. చైత్రశుద్ధ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగింది. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, వికాస్ శర్మ పాల్గొన్నారు.

లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని భవన నిర్మాణం అనుమతులు మంజూరు లైసెన్స్‌కు టెక్నికల్ సర్వేయర్ లైసెన్స్ ప్రక్రల్ ఇంజనీర్‌గా లైసెన్స్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఇన్‌చార్జి కమిషనర్ ఏపీఎస్ జాన్సన్ ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ సివిల్ డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ అభ్యర్థులు ఏపీవో బీపీఎస్/ఏపీ డీపీఎంఎస్ పోర్టల్‌లో నమోదుచేసుకోవాలన్నారు.

సత్యసాయి ఆరాధనోత్సవం

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం సత్యసాయిబాబా వీధిలో గల సాయి మందిరంలో సామూహిక సత్యసాయి అష్టోత్తర శతనామావళి తండులార్చన సామూహిక, శతనామావళి స్మరణ, నారాయణ సేవా అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం వేద పఠనం, సత్యసాయి దివ్య నామసంకీర్తన, మంగళహారతి జరిగింది. కార్యక్రమంలో సమితి ఆధ్యాత్మిక సమన్వయకర్త ఈశ్వర్ మాస్టారు, కన్వీనర్ రఘుపతి గోపాలరావు, సత్యసాయి సమితి సభ్యులు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

జి.సిగడాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందజేసిన వ్యవసాయ పనిముట్లను రైతులు వినియోగించుకోవాలని విజయవాడ వ్యవసాయ కమీషనరేట్ కార్యాలయ అధికారులు మధులేట్, సురేషాన్ అన్నారు. 2024లో జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా రాయితీపై రైతులకు అందజేసిన నూర్పిడి యంత్రాలను గురువారం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రంలో వద్ద వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రైతులకు ఒక్కోక నూర్పు యంత్రంపై రూ.80 వేలు వరకు రాయితీ అందజేయటం హర్షనీమన్నారు. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న యంత్రసామగ్రిని పక్కదోవ పట్టకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రణస్థలం ఏడీఏ, ఏవో ఎర్రా శారధ, వీఏఏలు ఉన్నారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చ్యానాపురంలో గురువారం టెక్కలిఎక్సైజ్‌శాఖ అధికారులుదాడులు నిర్వహించి సారాతయారీకి సిద్ధంచేసిన 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ మీరా సాహిబ్ తెలిపారు. దాడులో పలాస, పొందూరు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

కంచిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఆటోలో 12 కిలో గంజాయి తరలిస్తున్న అనిల్‌నాయక్‌ను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్నట్టు సోంపేట సీఐ బి.మంగరాజు తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా ఎండ్రియా గ్రామానికి చెందిన అనిల్‌నాయక్ గురువారం మధ్యాహ్నం కంచిలి రైలు నిలయంలో గుర్తుతెలియని వ్యక్తికి అందజేసేందుకు ఆటోలో వచ్చినట్టు చెప్పారు. ఈ మేరకు రైలు నిలయం పక్కన ఉన్న పార్కు ఎదుట అనుమానాస్పదంగా తిరుగుతున్నట్టు గుర్తించామని తెలిపారు. కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు, సిబ్బందితో కలిసి అనిల్‌నాయక్‌ను పట్టుకుని విచారించగా.. ఆయన వద్ద ఉన్న సూట్‌కేసులో 12 కిలోల గంజాయి గుర్తించామని చెప్పారు. ఆయన నుంచి సెల్‌ఫోన్, ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

అనుమానం పెట్టుకుని.. హత్యచేసి

రణస్థలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పంచాయతీ పరిధి గొల్లపేట గ్రామానికిచెందిన ఆవాలభవాని హత్యకేసులో కొండవీర్రాజును జేఆర్‌పురం పోలీసులు అరెస్టుచేశారు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం కథనం మేరకు.. విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి మండలం పెద్దనడిపల్లికి చెందిన వీర్రాజు పైడిభీమవరంలోని ఓ హోటల్‌లో కొద్దినెలల కిందటి వరకు పనిచేసేవాడు.అక్కడే ఆవాలభవానీతో వీర్రాజుకు పరిచయం ఏర్పడింది. ఈనేపథ్యంలోవారి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈవిషయం బయటపడితే ఇబ్బంది పడాల్సివస్తుందని భవాని కొద్దిరోజులుగా వీర్రాజుకు దూరంగా ఉంటోంది.దీంతో భవానీపై వీర్రాజు అనుమానం పెట్టుకున్నాడు. ఈక్రమంలో ఈనెల 19న పైడిభీమవరం జంక్షన్ సమీపానగల ఓ చెరువు వద్దకు భవానీని రప్పించా డు. వీరిమధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పక్కాప్లాన్‌తో వచ్చి వీర్రాజు తనతో తెచ్చుకున్న చాక్‌తో భవానీ పీక కోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేసి వీర్రాజును కమ్మసిగడాం జంక్షన్‌లో అరెస్టుచేసినట్టు సీఐ అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

గులుమూరులో సోలార్ ఉపకరణాల చోరీ

హిరమండలం,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గులుమూరులో వంశధార నదికి ఆనుకుని ఉన్న పంటపొలంలో వ్యవసాయి మోటారుకు ఏర్పాటు చేసిన 5హెచ్‌పీ సోలార్ సిస్టమ్‌కు సంబందించి ఉపకరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కౌలు రైతు కె.సురేష్ వందెకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు.విద్యుత్ సదుపాయం లేకపోవడంతో మోటారుకు సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకొన్నాడు. సుమారు రూ.మూడు లక్షలు విలువ గల సోలార్ విద్యుత్ ఉపకరణాలు బుధవారం రాత్రి చోరీకిగురయ్యాయి. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు.

ఎర్రచందనం తోట దగ్ధం

కోటబొమ్మాళి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీజగన్నాథపురం పంచాయతీ బిర్లంగి సమీపంలోగల సర్పంచ్ లోకశక్తి రాజుకు చెందిన ఎకరా విస్తీర్ణంలోగల ఎర్రచందనంతోట గురువారం రాత్రి దగ్ధమయ్యింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది చేరకుని మంటలు అదుపుచేశారు. అప్పటికే తోట దగ్ధమయ్యింది. అయితే రాత్రిసమయం కావడం వల్ల అంచనా వేయడానికి అగ్నిమాపకసిబ్బందికి అవకాశం లేకుండాపోయింది.

కేసుల రాజీకి సహకరించాలి

టెక్కలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి సహకరించాలని టెక్కలిసీనియర్ సివిల్‌న్యాయాధికారి బి.నిర్మల కోరారు. గురువారం స్థానిక కోర్టు సముదాయాల పరిధిలో న్యాయవాదుల సంఘం హాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్ తేజచక్రవర్తి మల్ల, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ఏపీపీ కె.సుధారాణి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం

నందిగాం,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో ప్రయోజనం జరుగుతుందని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. గురువారం మణిగాం-1 రైతు సేవా కేంద్రం పరిధిలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1541 మట్టి నమూ నాలు సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అరవిందు పాల్గొన్నారు.

సాహిత్య పోటీల విజేతలు వీరే

టెక్కలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల బుధ,గురువారాల్లో నిర్వహించిన జాతీయస్థాయి సాహిత్య పోటీల్లో తమిళనాడు, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తొమ్మిది కళాశాలల నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచాలని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లాష్ ఫిక్షన్ విభాగంలో మొదటిబహుమతి ఎస్ఆర్ఎం చెన్నైకు చెందిన జి.వివేక్‌వర్ధన్, రెండు, మూడో బహుమతులను ఐతమ్ కళాశాలకు చెందిన ఎ.సుధారాణి, వి.హర్ష సాధించారని పేర్కొన్నారు.స్క్రీన్‌ప్లే రైటింగ్ కాంపిటీషన్‌లో ఐతమ్ విద్యార్థులు కె.నిఖిల్,పీఆర్ రోహిత్‌లు, మొదటి,రెండు స్థానాలుపొందగా మూడో బహుమతిని ఎచ్చెర్ల శివానీకళాశాల, డ్రామాటిక్ పెర్ఫార్మెన్స్‌లో ఐతమ్ మృదుల బృందం విజేతలుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. పోటీలు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, బీఎస్అండ్ విభాగాధిపతుల పర్యవేక్షణలో జరిగాయని పేర్కొన్నారు.

వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలి

పాతపట్నం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని వీఆర్ఏల సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు వీఆర్ఏ పి.రమణ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ తరహా లో పేస్కేల్ అమలుచేయాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగాఇసుక, రైస్ మిల్లుల వద్ద నైట్‌డ్యూటీలు వేయడం నిలిపివేయాలని డిమాండ్‌చేశారు.

కారు ఢీకొని సెంచూరియన్ ఏజీఎం మృతి



ఫాల్గుణరావు (ఫైల్)

పర్లాకిమిడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):గజపతి జిల్లాలోని పర్లాకిమిడి నియోజకవర్గంలోని కాటిపాకకు చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ అడ్మిషన్ జనరల్ మేనేజర్(ఏజీఎం) ఫాల్గుణరావు(50) కారు ఢీకొన్న ఘటనలో మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు.. పర్లాకిమిడిలోని సెంచూరియన్ యూనివర్సిటీలోక్యాంపస్ అడ్మిషన్ జనరల్ మేనేజర్‌గా ఫాల్గుణరావు విధులు నిర్వహిస్తున్నారు.గురువారం భువనేశ్వర్‌లోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న సమావేశంలో పాల్గొనేందుకు పర్లాకిమిడి నుంచి కారులో బయలుదేరారు. బరంపురంలో కారుకు డ్రైవర్ పెట్రోల్ వేయించేందుకు ఆపాడు.ఆ సమయంలో ఫాల్గుణరావు కారు దిగి నడుచుకుని వెళ్తుండగా అటుగా వచ్చిన గుర్తుతెలియని కారుఢీకొట్టింది. దీంతో గాయపడిన ఫాల్గుణరావుకు బరంపురం తరలించారు.అక్కడి వైద్యులు వైద్యం అందించే ప్రయత్నంచేసే సమయానికి మృతి చెందినట్లు గుర్తించారు. ఫాల్గుణరావుకు భార్య ఇద్దరు కుమారైలు ఉన్నారు. ఫాల్గుణరావు మృతితో వర్సిటీలో విషాదచాయలు అలుముకున్నాయి. వర్సిటీ ఛైర్మన్ ముక్తీకాంత్ మిశ్రీ, వైస్ ఛైర్మన్ డీఎన్‌రావు, రిజిస్ట్రార్ అనిత పాత్రో సంతాపం తెలిపారు. ఫాల్గుణరావు కుటుంబాన్ని పలాస పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ శ్రీధర్ పరామర్శించారు. కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ సౌమ్యామిశ్రా, అకౌంట్ మేనేజర్ మనోజ్ మహపాత్రో, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

రోడ్డుపై మురుగు.. రాకపోకలకు అవస్థలు



12వ వార్డు లక్ష్మీనగర్ వీధిలో రోడ్డుపైకి చేరిన మురుగు

● పాలకమండలి లేకపోవడంతో పరిష్కారానికి నోచుకోని వైనం ● ఇదీ ఆమదాలవలస మునిసిపాలిటీలో పరిస్థితి

ఆమదాలవలస, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పలుచోట్ల రహదారులపై మురుగునీరు చేరుతుండడంతో రాకపోకలకు పాదచారులు, వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు. మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ జరిగినా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించలేదు. దీంతో వేసవిలో సైతం రోడ్డుపైకి పలుచోట్ల మురుగు నీరు చేరుతోంది. పలు ప్రాంతాల్లో మురుగునీరు వెళ్లేలా డ్రైనేజీవ్యవస్థను రూపకల్పనలో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ప్రధానంగా ఎనిమిదేళ్లుగా పురపాలక సంఘం పాలకవర్గం లేకపోవడంతో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు.

ఇదీ పరిస్థితి

● ఆమదాలవలసమునిసిపాలిటీలో 23 వార్డులకుగాను కొన్ని వార్డుల్లో ఇప్పటికీ పూర్తిస్థాయి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు నోచుకోలేదు. దీంతో నిత్యం వాడుక నీరు రోడ్లపైకి చేరుతోంది.

● ఒకటో వార్డు పార్వతీశునిపేట ప్రాంతంలో మురుగు కాలువలు లేకపోవడంతో పరిసర ప్రాంత గృహాల వాడుకనీరు ప్రధాన రహదారిపై చేరడంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి.శ్రీకాకుళం, సరుబుజ్జిలి, హిరమండలం వైపు రాకపోకలు సాగించే వాహనాలకు ఆమదాలవలస పట్టణంలోనికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రద్దీగా ఉంటోంది.ఈ నేపథ్యంలో రహదారిపై గుతుల్లో మురుగు నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

● ఎనిమిదో వార్డు బొడ్డేపల్లి రాజగోపాలరావు నగర్ ఏర్పాటు 15 ఏళ్ల పూర్తికావస్తోంది. ఇప్పటికీ పురపాలక సంఘం అక్కడ వీధుల్లో పక్కా రహదారులు, మురుగుకాలువలు ఏర్పాటు చేయలేదు. కాలువలు లేకపోవడంతో మట్టి రహదారులపైనే మురుగునీరు చేరుతోంది. దీంతో దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు.

● 12వవార్డు లక్ష్మీనగర్ వీధిలో నిరంతరం మురుగునీరు ప్రధాన రహదారిపైనే ప్రవహించడంతో మునిసిపల్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.● 16వ వార్డు పూజారిపేట సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైంది.ఒకచోట మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నా యి.ఇక్కడి సమస్య పరిష్కరించాలని గతంలో అదే ప్రాంతానికి చెందిన కొందరు ఎమ్మెల్యే కూన రవికుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఫిర్యాదుచేసిన విషయం విదితమే.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తాగునీటి ఎద్దడితలెత్తకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.గురువారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.అంబేడ్కర్ వర్సిటీ రూ.38 కోట్లతో నిర్మించిన పరిపాలన భవనం శుక్రవారంముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.ఈ మేరకు మంత్రిని ఆచార్యులు జీవీకే రజిని, సుజాత, సామ్రాజ్య లక్ష్మి కలిశారు.టెక్కలి మండలంలోని అక్కువరానికి చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు తమ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలని కోరారు.అలాగే సహాయ న్యాయవాదిగా నియమితులైన గొద్దు భాగ్యలక్ష్మి బీజేపీ నాయకులు రవి బాబ్జి, రాంజీతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కలిశారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోండి

● ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందసరస్వతి స్వామి

కొత్తూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ సన్మార్గంలో పయనించేందుకు భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనందా సరస్వతి స్వామి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కొత్తగూడలో శ్రీగిరివర్ధన వేణుగోపాలస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తిద్వారా జ్ఞానాన్ని సంపాదించి ముక్తి మార్గంలో పయనించేలా ఇతరుల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు.కార్యక్రమంలో ఎల్.లక్ష్మీనారాయణనాయడు, ఎల్.తులసీవరప్రసాదరావు, కొయిలాపు సంజీవరావు, శ్రీనివాసరావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.



కొత్తూరు: మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి స్వామి

భక్తి శ్రద్ధలతో వేంకటేశ్వర కల్యాణం

జలుమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడలో వేంకటేశ్వరస్వామి కల్యాణం గ్రామ పురోహితులు మావుడూరి పార్వతీశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అల్లాడతో పాటు పరిసర గ్రామాలకు చెందిన రామదాసుపేట, అల్లాడపేటకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామికి గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.బహుళ ఏకాదశి పురస్కరించుకొని అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి దర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం గర్భగుడిలోగల పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను బయటకు తీసుకొచ్చి అలంకరించి ప్రత్యేక పల్లకిలో ఆశీనులను చేశారు. వేదమంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అప్పారావు, శివ, శ్రీకృష్ణ, సింహాచలం పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ వార్షికోత్సవం

నందిగాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటూరులో నీలమణిదుర్గ, చింతపోలమ్మ అమ్మవార్ల ఆలయాల ఏడో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో ఉత్సవకమిటీ నేతృత్వంలో గ్రామ పురోహితులు రేజేటి బోసుబాబు, సహాయకులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేషపూజలు, హోమం, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

● పాతపట్నం హౌసింగ్‌బోర్డు కాలనీలో నిరసన

పాతపట్నం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో గల జనావాసాల్లో గీతకార్మికులకు కేటాయించిన మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికులు, మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కోర్టు, పోలీస్‌స్టేషన్, సమీకృత బాలుర వసతిగృహం, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్, వెలుగు,ఉపాధి, హౌసింగ్ కార్యాలయాలు, 50 పడకల ఆసుపత్రిఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏలా ఏర్పాటుచేస్తారని ప్రశ్నించారు. మద్యం దుకాణం నిర్వహణకు అనుమతులు విరమించుకోవాలని కోరారు. అవసరమైతే నిరాహార దీక్షలకైనా వెనుకాడబోమని మహిళలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్‌బోర్డుకాలనీవాసులు, విశ్రాంత ఎంపీడీవో సలాన చిరంజీవి, బీజేపీ నాయకుడు దుక్క శ్రీకాంత్ ,విశ్రాంతఉపాధ్యాయుడు రేగేటి ఆనందరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న హౌసింగ్‌బోర్డు కాలనీలోని మహిళలు

ప్రభుత్వ లేఅవుట్‌లోనే స్థలాలు కొనుగోలు చేయండి

పలాస, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ లేఅవుట్‌లోనే స్థలాలు కొనుగోలు చేసి గృహ నిర్మాణం చేసుకుంటే ఇబ్బందులు ఉండవని ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు తెలిపారు. గురువారం పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కార్యాలయం ఆవరణలో బొడ్డపాడు రెవెన్యూ పరిధి జాతీయరహదారి వద్ద సుడా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎంఐజీ లేఅవుట్‌లో లాటరీలో ఇంటి స్థలాలు పొందిన వారికి అలాట్‌మెంట్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో సుడా పీవో అమర్నాథ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మోహన్, వెంకటేష్, టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలి

అరసవల్లి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలు చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆదినారాయణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు గురువారం శ్రీకాకుళం ఉప కార్మిక కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరినారాయణ, ఎం.హరనాథరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, నాయకులు గంజి భీమారావు, కరగాన భాస్కరరావు, అనుపోజు కామేశ్వరరావు, పనస రమేష్, పడిమి శ్రీను, కె.ఆనందరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

పొందూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పొందూరులో సచివాలయం, ఎస్‌డబ్ల్యూపీసీ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, ఎంపీపీ కె.ఉషారాణి, సర్పంచ్ ఆర్.లక్ష్మి, తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంపీడీవో మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్‌లో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఇద్దరు కేజీబీవీకి చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ. మేరకు వారు గురువారం పయనమయ్యారు. రాష్ట్రస్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికైన కేజీబీవీకి చెందిన జి.అంజలి(8వ తరగతి), పి.హైమా (9వ తరగతి)లకు ఎలియన్స్ క్లబ్ సభ్యులు రూ.ఆరువేలు అందజేశారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు లోపింటి నరసింహమూర్తి, సభ్యులు బత్తుల వెంకటరమణ, పి.బుజ్జి, బాలకృష్ణ, బి.రామారావు, ప్రిన్సిపాల్ పొన్నాడ శిరీష, పీఈటీ భారతి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలదే కీలకపాత్ర

● జిల్లాలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలదే కీలకపాత్ర అని పలువురు పంచాయతీ అధికారులు తెలిపారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని మండలపరిషత్ కార్యాలయాల్లో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రాధాన్యతను వివరించారు.

● టెక్కలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ, ఎంపీడీవో లక్ష్మీబాయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బందిని సన్మానించారు.

● ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఎంపీపీ జ్యోతిలక్ష్మి, జడ్పీటీసీ కె.త్రినాథులు, ఏవో మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

● పోలాకి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో రవికుమార్ పంచాయతీరాజ్ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. మండల పరిషత్‌సలహాదారు ముద్దాడ బైరిగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీలు, పారిశుధ్యకార్మికులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోట అప్పారావు, సూపరింటెండెంట్ బలగ ప్రకాష్, ఈఓపీఆర్డీ బి.పద్మావతి పాల్గొన్నారు.

● నరసన్నపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలో ప్రజాప్రతినిధులు, అధికారులను ఎంపీపీ ఆరంగి మురళీధర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదనరావు, ఈవోఆర్డీవో రేణుక పాల్గొన్నారు. అలాగే నరసన్నపేట పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ శంకరరావు, ఉపసర్పంచ్ సానువల్లి కృష్ణబాబు, ఈవో ద్రాక్షాయిణి పాల్గొన్నారు.

● మెళియాపుట్టి, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులది కీలకపాత్ర ఉండాలని ఎంపీడీవో నర్సింహప్రసాద్‌పండా తెలిపారు. మెళియాపుట్టిలో పలువురు ప్రజాప్రతినిధులకు సన్మానించారు.కార్యక్రమంలో ఎంఈవో పద్మానాభం పాల్గొన్నారు.

● పాతపట్నం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో చంద్రకుమారి ఆధ్వర్యంలో పీఆర్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ ఉద్యోగకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

● కొత్తూరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఎంపీడీవోలో ఎంపీటీసీలకు సన్మానించారు.ఈ సందర్భంగా 73వ రాజ్యాంగసవరణ చట్టంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి,వైస్ ఎంపీపీ తులసీవర ప్రసాదరావు, మాజీ ఎంపీపీ బైరాగినాయుడు, ఎంపీడీవో నీరజ, ఈవోపీఆర్డీ వసంత కుమారి, పాల్గొన్నారు.

● నందిగాం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యదర్శులు పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

● జలుమూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):ఎంపీడీవో కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి ఎంపీడీవో కె.అప్పలనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యదర్శులు, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

● హరిపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):మందస మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్‌రమేష్‌నాయడుకు ఎంపీపీ దానయ్య, మండలపరిషత్ సిబ్బంది సన్మానించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన గ్రామ సచివాలయ సిబ్బంది సన్మానించి ప్రసంశా పత్రాలు అందజేశారు.

● గార ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) శ్రీకూర్మంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, ఈవో ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

● బూర్జ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి):ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉపాధ్యక్షుడు సూర్యారావు అధ్యక్షతన పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్.తిరుపతిరావు, ఈవోపీఆర్‌డి విజయలక్ష్మి, కొల్లివలస ఎంపీటీసీ విక్రం పాల్గొన్నారు.

● కంచిలి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవరాజ్‌రెడ్డి, ఏవో రమణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఆహారం, రొట్టెలు, పండ్లు అందజేస్తున్న సత్యసాయి విద్యావిహార్ నిర్వాహకులు

పలాస, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణాపురం సత్యసాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబా ఆరాధనోత్సవాల్లో బాగంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ఆహారం, పండ్లు, రొట్టెలు, బాబాఊది ప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే బాబా సూక్తిని పాటిస్తున్నామని, సత్యసాయి ఆశీసులు అందరికీ ఉండాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు,ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీనివాస్, డి.మురళి, రవిశంకర్, శ్రీనివాస్, సాంబ మూర్తి, చిన్నారావు, వివేకానంద,రుషికేష్, అశోక్, హేమంత్, హేమ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌సరఫరాకు అంతరాయం

నరసన్నపేట, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి):నరసన్నపేటలోని ఫీడర్-1 పరిధిలో నిర్వహణ పనులదృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, సంతపేట, నేతాజీవీధి, భవానీపురం, చిత్రవీధి, పీఎస్‌కాలనీ, దేశవానిపేట, శివనగర్‌కాలనీ, వజ్రంపేట, పసారువీధి, బొంతలవీధి, నక్కవీధి, ఆదివారంపేట, వీరన్నాయుడుకాలనీ, తిరుమలవీధి, సత్యనారాయణనగర్, కామేశ్వరినగర్, బొరిగివలస గ్రామాలకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఒకటో తేదీ నుంచి క్రికెట్ టోర్నీ

నరసన్నపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో రమేష్-శేఖర్ జ్ఞాపకార్థం మే ఒకటో తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నరసన్నపేట సీనియర్ క్రికెటర్స్ సభ్యులు రవి, శ్రీను, దిలీప్, రాములు తెలిపారు. నరసన్నపేటలో ఎందరో క్రీడాకారులకు రమేష్‌శేఖర్‌లు స్ఫూర్తిదాయంగా నిలిచారని పేర్కొన్నారు. వారి జ్ఞాపకార్థం నిర్వహించే ఈ ట్రోఫీలో విన్నర్స్‌కు రూ.30వేలు, రన్నర్స్‌కు రూ.20వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల జట్లు 8978909592, 9885174191 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలాసరూరల్, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): రానున్న విద్యాసంవత్సరంలో బలహీనవర్గాల పిల్లలు సీబీఎస్ఇ/ఐసీఎస్ఇ/ స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న పాఠశాలల్లో ఉచిత ప్రవేశం కోసం ఈనెల28 నుంచి మే 15వరకూ దరఖాస్తులు నమోదుచేసుకోవాలని ఎంఈవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్‌లో ప్రవేశానికి ఏప్రిల్ 2,2019 నుంచి మార్చి31 2020 మధ్య జన్మించి ఐదేళ్లు నిండిఉండాలని, స్టేట్ సిలబస్‌కు నమోదుచేసే వారు జూన్ 2, 2019 నుంచి మే31, 2020 మధ్య జన్మించి ఐదేళ్లనిండి ఉండాలని పేర్కొన్నారు. సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవా సెంటర్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

టీడీపీతోనే మత్స్యకారుల అభ్యున్నతి

సంతబొమ్మాళి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల అభ్యున్నతి టీడీపీ ప్రభుత్వం హయంలోనే సాధ్యమని ఆ పార్టీ మత్స్యకారసంఘ నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంటి, దుమ్మ రాణా ప్రతాప్ తెలిపారు.గురువారం సంతబొమ్మాళిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో బినామీ పేర్లతో భరోసాను వైసీపీ నాయకులు కాజేశారని, నేడు గ్రామాల్లో విచారణ చేపట్టి అర్హులైన లక్షా 50వేల మంది మత్స్యకారులకు మత్స్య కార భరోసాను శుక్రవారం సీఎం అందజేయనున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

పలాసరూరల్, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో వేసవి తరగతులు ప్రారంభించినట్లు ఆ వేదిక అధ్యక్ష,కార్యదర్శులు బొమ్మల శివ, గొరకల లోకేశ్వరరావు తెలిపారు. గురువారం ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్ స్పోకెన్ కోర్సు చేపట్టారు.